క్లుప్తంగా

సర్రాజుకు నివాళి



కొయ్యలగూడెంలో పాతపాటి సర్రాజుకు నివాళి అర్పిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం : పోలవరం నియోజకవర్గం వైఎస్సార్ సీపీ పరిశీలకులు, మాజీ ఎమ్మెల్యే పాతపాటి సర్రాజు సంస్మరణ కార్యక్రమం వైఎస్సార్ విగ్రహం వద్ద నిర్వహించారు. శనివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సర్రాజు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఇటీవల కొయ్యలగూడెంలో సచివాలయ కన్వీనర్లు గృహ సారథులకు నిర్వహించిన కార్యక్రమంలో సర్రాజు పాల్గొన్నారని, ఇంతలోనే మృత్యుఒడికి చేరుకోవడం తీవ్రంగా కలచివేసిందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన అకాల మృతి పార్టీకి తీరని లోటు అని, సర్రాజు ఆత్మశాంతికై మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు గొడ్డడి నాగేశ్వరరావు, గంజిమాల రామారావు, నూకల రాము, చిక్కాల దుర్గాప్రసాద్, మట్ట సత్తిపండు, సంకుకొండ, మారిశెట్టి శ్రీను, ఎస్కే బాజీ, కొల్లూరు యశ్వంత్, మడుతురి శ్రీను,మన్నే అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ.50 వేల విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

కొయ్యలగూడెం : శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ మదన గోపాల స్వామి ఆలయ నిర్మాణ అభివృద్ధి నిమిత్తం కొయ్యలగూడెం గ్రామస్తులు విగ్గిన సూరిబాబు, సూర్యకుమారి దంపతులు రూ.51,399 విరాళం అందజేశారు. శనివారం ఆలయ వద్ద కమిటీ చైర్మన్ మధు గోపాలకృష్ణకు ఈ విరాళాన్ని అందజేశారు. తన తండ్రి విగ్గిన కృష్ణమూర్తి జ్ఞాపకార్థం విరాళాన్ని అందజేసినట్లు సూరిబాబు తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు గునుపూడి వెంకట శేషాచార్యులు, చోడిపిండి సుబ్రహ్మణ్యం, మజ్జి సూరిబాబు, కొల్లూరు వీరభద్రరావు, పాల్గొన్నారు.

ప్రేరణ తరగతులు



పదవ తరగతి విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం : పదవ తరగతి విద్యార్థులకు ప్రేరణ తరగతుల శిక్షణ నిర్వహణ వలన ఉత్తీర్ణత శాతం మెరుగవుతుందని, విద్యార్థులు ఉన్నతమైన గ్రేడులతో ఉత్తీర్ణులు అవుతారని సాంఘిక సంక్షేమ శాఖ వసతిగృహాల సముదాయ అధికారి జి.సంకురయ్య పేర్కొన్నారు. శనివారం కొయ్యలగూడెంలోని ప్రకాశం డిగ్రీ కళాశాలలో వసతి గృహ సంక్షేమ విద్యార్థులకు ప్రత్యేక ప్రేరణా తరగతులు నిర్వహించారు. పరీక్షలు హాజరయ్యే సమయంలో ఆత్మస్థైర్యం, ఏకాగ్రత సాధన తదితర వివరాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వసతి గృహ సముదాయ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

పులిహోర పంపిణీ



పులిహోర పంపిణీని పరిశీలిస్తున్న జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులు

పోలవరం రూరల్ : మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో పట్టిసీమ ఉత్సవాల్లో పులిహోర పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ పీడీ ఆదేశాల మేరకు ఎస్‌హెచ్‌జీ సభ్యులు సేకరించిన గుప్పెడు బియ్యం కార్యక్రమం ద్వారా సేకరించిన బియ్యంతో తయారు చేసిన పులిహోరను శనివారం సుమారు 15వేల మంది పట్టిసీమ భక్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఏపీడీ నాగేశ్వరరావు పర్యవేక్షించారు. కార్యక్రమంలో వీవోఏలు, సీసీఎస్‌లు, ఎంఎంఎస్ లీడర్లు, సీఆర్‌పీలు, మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ స్థానాల్లో ఒకటి కాపులకు కేటాయించాలి

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్థానిక సంస్థల నుంచి శాసనమండలికి జరిగే ఎన్నికల్లో ఉన్న రెండు స్థానాల్లో ఒకటి కాపులకు కేటాయించాలని కాపు సంఘం జిల్లా అధ్యక్షులు పులి శ్రీరాములు కోరారు. గోదావరి జిల్లాల్లో అధిక సంఖ్యలో ఉన్న కాపులకు న్యాయం చేయాలన్నారు. ఇటీవల కాపు సామాజిక వర్గాలు ఉన్న చోట్ల కొన్ని శక్తులు ఉద్దేశపూర్వకంగా అసమ్మతి పేరుతో వ్యతిరేక శక్తులను ప్రోత్సహిస్తున్నారన్నారు.ఈ చర్యల ద్వారా కాపు సామాజిక వర్గానికి అన్యాయం చేయాలనే ఆలోచన కనిపిస్తుందన్నారు. ఖాళీ అయిన ఎమ్మెల్సీ స్థానాల్లో ఒకటి కాపులకు కేటాయించి న్యాయం చేయాల్సిందిగా పులి శ్రీరాములు విజ్ఞప్తి చేశారు.

మహాదేవా.. శంభో శంకరా

- భక్తులతో కిటకిటలాడిన శైవక్షేత్రాలు
- శివయ్యకు పూజలు, అభిషేకాలు
- నేత్రపర్వంగా స్వామి, అమ్మవార్ల కల్యాణం



భక్తులతో పోటెత్తిన కట్కూరు గ్రామం , కొయ్యలగూడెం శివాలయంలో విశేష అలంకరణలో శ్రీ ఉమా సమేత భోగ లింగేశ్వర స్వామి →





ప్రత్యేక పూజలందుకున్న తాడువాయి వీరేశ్వరస్వామి

జంగారెడ్డిగూడెం : ఓం నమః శివాయ, హర హర మహాదేవ శంభోశంకర అంటూ భక్తుల స్మరణతో శివాలయాలు మార్మోగాయి. పట్టణంలోని ప్రధాన శివాలయాల్లో ముక్కంటికి మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున 4 గంటల నుంచే ఆలయాల్లో పంచామృతాభిషేకాలు, బిల్వార్చనలు, రుద్రాభిషేకాలు నిర్వహించారు. పార్వతీ పరమేశ్వర కల్యాణాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివెళ్లి ఆ పరమేశ్వరుడిని దర్శించుకున్నారు. పట్టణంలోని బైనేరు శివాలయం వద్ద ఉమాసహిత రామలింగేశ్వరస్వామికి అభిషేకాలు, ఉదయం 10 గంటల నుంచి కల్యాణం నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలతో పాటు అల్పాహారం, మధ్యాహ్నం అఖండ అన్నసమారాధన చేశారు. పంగిడిగూడెం రోడ్డులోని శివాలయం భక్తులతో కిటకిటలాడింది. హైస్కూల్ వద్ద ఉన్న సర్వమంగళదేవి సమేత కాశీ విశ్వేశ్వరుడికి భక్తులు అభిషేకాలు చేశారు. రాజీవ్‌నగర్‌లో కొలువై ఉన్న ఓంకారేశ్వరస్వామివారికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. నేత్రపర్వంగా శివదేవుని కళ్యాణం జరిపారు.

భక్తజనసంద్రం.. తాడువాయి శైవక్షేత్రం

జంగారెడ్డిగూడెం రూరల్ : మండలంలోని తాడువాయి శ్రీభద్రకాళి సమేత వీరేశ్వరస్వామి క్షేత్రం భక్త సంద్రమైంది. వేకువజాము నుంచే భక్తులు స్వామి వారి దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరారు. ప్రధానార్చకులు కాళ్లకూరి రవికుమారాశర్మ స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ క్షేత్రంలో 5రోజుల పాటు జరిగే కల్యాణ ఉత్సవాల్లో భాగంగా ఈనెల 19వ తేదీన వీరేశ్వరస్వామి గ్రామోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ పాపోలు వెంకటేశ్వరరావు తెలిపారు. మాజీ ఎంపీటీసీ సత్రం లక్ష్మణరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పల్లా గంగాధరరావు, కనికళ్ల ప్రసాద్, ఓరుగంటి నాగేంద్ర, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అలాగే వేగవరం, పంగిడిగూడెం, గురవాయిగూడెం, లక్కవరం గ్రామాల్లో ఉన్న శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి.

లింగపాలెంలో...

లింగపాలెం : మహాశివరాత్రిని పురస్కరించుకుని శనివారం మండలంలోని శివాలయాలు భక్తుల హర నామ స్మరణతో మార్మోగాయి. ధర్మాజీగూడెం, బాదరాల, ఆశన్నగూడెం గ్రామాల్లో వేకువజామునుంచే స్వామివారిని దర్శించుకుని భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు చేరుకున్నారు. స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఈ మండలానికి దగ్గరలో ఉన్న బలివే క్షేత్రానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ధర్మాజీగూడెంలో శ్రీ ధర్మలింగేశ్వరస్వామికి రుద్రాభిషేకాలు, అమ్మవారికి కుంకమార్చనలు చేశారు. భక్తులు ప్రత్యేక వ్రతాలు ఆచరించారు. అనంతరం స్వామివారికి కల్యాణం చేశారు. వాసవీ, వనిత డైమండ్ క్లబ్, ఆర్యవైశ్య సంఘం వారి ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు సోమిశెట్టి గంగాధరావు, కందుల రత్నమాల, కార్యదర్శి కె పురుషోత్తం, కోశాధికారి ఎస్.బలరామకృష్ణ, బి.ప్రకాశరావు, కందుల శాస్త్రులు, సభ్యులు పాల్గొన్నారు.

చింతలపూడిలో...

చింతలపూడి : చింతలపూడి మండలంలో శనివారం మహాశివరాత్రిని భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం 5 గంటల నుంచే భక్తులు శివునికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక వేగిలింగేశ్వరస్వామి దేవాలయం, రేచర్ల , రాఘవాపురం గ్రామాల్లో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అనంతరం శివపార్వతుల కల్యాణాన్ని తిలకించారు. షిరిడీ సాయిబాబా ఓం గాంగేశ్వర స్వామికి రుద్రాభిషేకం

కామవరపుకోట : మహాశివరాత్రి పురస్కరించుకుని తడికలపూడిలో వేంచేసియున్న శ్రీ గంగా పార్వతీ సమేత గాంగేశ్వర స్వామిని భక్తులు దర్శించారు. శనివారం ఉదయం స్వామివారికి మహాజ్ఞా స్వయంభు ఏక రుద్రాభిషేకం అనంతరం పరిహారణ, గ్రామపరిహారణ నిర్వహించినట్లు ఆలయ అర్చకులు తాతాజీ, రమేష్ తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున స్వామి అమ్మవార్ల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నమని, భక్తులు పాల్గొని జయంప్రదం చేయాలని కోరారు.

కొయ్యలగూడెంలో...

కొయ్యలగూడెం : మహాశివరాత్రి పర్వదినాన అంకాలగూడెం శ్రీ ఉమా సమేత భోగలింగేశ్వర స్వామి విశేష అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చాడు. బ్రహ్మశ్రీ మామిళ్ళపల్లి ఆనంద శివాచార్యులు హోమం నిర్వహించారు. కొయ్యలగూడెంలోని శ్రీ మీనాక్షి సుందరేశ్వర స్వామి ఆలయంలో 8 అడుగుల భారీ అగర్బత్తిని వెలిగించారు. కన్నాపురం శ్రీ దుర్గా భవాని రసలింగేశ్వర స్వామి ఆలయం వద్ద పెద్ద సంఖ్యలో భక్తులు స్వామికి స్వయం అభిషేకాలు, అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. పులి వాగు శ్రీ భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామి ఆలయ వద్ద, యర్రంపేట శ్రీ ఉమా సమేత రామలింగేశ్వర స్వామి ఆలయాల వద్ద భక్తులు అధిక సంఖ్యలో పూజలు నిర్వహించారు. పట్టిసీమ పుణ్యక్షేత్రానికి వేలాది మంది భక్తులు తరలి వెళ్లడంతో కొయ్యలగూడెం పోలవరం మెయిన్ రోడ్డు ట్రాఫిక్ రద్దీ నెలకొంది.

బుట్టాయగూడెంలో...

బుట్టాయగూడెం : మహాశివరాత్రి పురస్కరించుకుని శనివారం తెల్లవారుజాము నుంచే భక్తుల తాకిడితో శివక్షేత్రాలు కిటకిటలాడాయి. మండలంలోని అతిపెద్ద శివక్షేత్రమైన త్రిపుర సుందరీ సమేత కామేశ్వర స్వామివారి ఆలయం, రెడ్డిగణపవరంలోని విశ్వేశ్వరస్వామి ఆలయం అదేవిధంగా కొమ్ముగూడెం గట్టు సమీపంలో ఉన్న ఉమా సహిత ఉమామహేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. చింతలగూడెం సమీపంలోని శివాలయం, బెడదనూరు అటవీప్రాంతంలో కొలువై ఉన్న శివాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

ఇతర జిల్లాల నుంచి తరలివచ్చిన భక్తులు

వేలేరుపాడు : వేలేరుపాడు మండలంలో గోదావరి తీరాన ఉన్న శివాలయాలు శనివారం శివ నామస్మరణలతో మార్మోగాయి. కట్కూరు గుట్టపై ఉన్న ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు పోటెత్తారు. ఈ ఆలయానికి గోదావరి అవతలి ఒడ్డున ఉన్న తూర్పుగోదావరి జిల్లా వీఆర్‌పురం, తెలంగాణా రాష్ట్రంలోని అశ్వారావుపేట, దమ్మపేట, భద్రాచలం తదితర ప్రాంతాల నుంచి సుమారు 15 వేలమంది భక్తులు తరలి వచ్చారు. ఈ సందర్భంగా శివాలయ అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రాత్రి ఏడు గంటలకు శివాలయంలో హోమం, కల్యాణం పూజలు చేశారు. తహసీల్దార్ కుంజా చల్లన్నదొర, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు పర్యవేక్షించారు. తూర్పుగోదావరి జిల్లా భక్తులకు ఉచితంగా రెండు బోట్‌లు ఏర్పాటు చేశారు. ఆర్‌ఎక్స్100 సినీమా హీరో కార్తీక్ తండ్రి విఠల్‌రెడ్డి భక్తులకు ఉచిత భోజనం, మంచినీటి సదుపాయాలను కల్పించారు. రుద్రమకోటలో రుద్రకోటేశ్వరస్వామి ఆలయం, శివకాశీపురం భవానీ మల్లేశ్వరస్వామి ఆలయం, పేరంటపల్లిలో శ్రీరామకృష్ణమునివాటం తదితర ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ కార్యక్రమాల్లో వేలేరుపాడు ఎస్సై శ్రీనివాసరావు, ఎంపీపీ వల్లా లక్ష్మీదేవి, కట్కూరు సర్పంచ్ లక్ష్మణ్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కేసగాని శ్రీనివాసగౌడ్, పార్టీ నేతలు కామినేని వెంకటేశ్వరావు, గుద్దేటి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

టి.నరసాపురం : టి.నరసాపురం కాశీ విశ్వేశ్వర స్వామి వారి ఆలయంలో సామూహిక మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు నిర్వహించారు. రాత్రి స్వామి వారి దివ్య కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. మక్కినవారిగూడెం భువనేశ్వరి సమేత చంద్రశేఖర స్వామి వారి ఆలయంలో శనివారం రాత్రి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. రాజుపోతేపల్లి శివాలయంలో ప్రత్యేక అభిషేకాలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తరించారు.

కుక్కునూరులో...

కుక్కునూరు : పెద్దరావిగూడెం శ్రీకేదారేశ్వర స్వామి ఆలయం, కుక్కునూరు కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయాల్లో మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఇక్కడి ఆలయాలకు మండలం నలుమూలల నుంచే కాక తెలంగాణ రాష్ట్రం నుంచి భక్తుల తాకిడి అధికంగా ఉండడంతో అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేశారు. పెద్దరావిగూడెం ఆలయ గుట్టమీదకు చేరుకునేందుకు భక్తుల కోసం కమిటీ చైర్మెన్ ఎల్లంకి లక్ష్మణ్‌రావు ప్రత్యేకంగా ఆటోలు ఏర్పాటుచేశారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

క్షేత్రపాలకునికి విశేష అభిషేకాలు

ద్వారకాతిరుమల : క్షేత్రపాలకుని ఆలయంలో శివదేవుని కల్యాణం శనివారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయానికి భక్తుల రాక తెల్లవారుజాము నుంచే ప్రారంభమైంది. స్వామివారి దర్శనార్థం భక్తులు పెద్ద ఎత్తున ఆలయ ఆవరణలో బారులుతీరారు. అలాగే ఆలయంలోని ఉసిరిచెట్ల వద్ద దీపారాధనలు చేశారు. గర్భాలయంలో కొలువైన శివదేవునికి ఆలయ అర్చకులు, పండితులు విశేష అభిషేకాలను జరిపారు. రాత్రి లింగోద్భవ సమయంలో గంగా, పార్వతీ సమేత శివదేవుని కల్యాణ మహోత్సవాన్ని భక్తుల శివనామస్మరణల నడుమ వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామివారికి గ్రామోత్సవాన్ని జరిపారు. ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ద్వారకాతిరుమల క్షేత్రపాలకుని ఆలయంలో శివదేవునికి విశేష అభిషేకాలు



జంగారెడ్డిగూడెంలో సర్వమంగళాదేవి సహిత కాశీ విశ్వేశ్వరునికి అభిషేకాలు



తడికలపూడిలోని గాంగేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



బుట్టాయగూడెం శివాలయంలో భక్తుల క్యూ



చింతలపూడి శివాలయంలో భక్తుల సందడి



ధర్మాజీగూడెం శివాలయంలో భక్తులకు ప్రసాద వితరణ



పెద్దరావిగూడెంలో ద్వాదశలింగాలను దర్శించుకుంటున్న భక్తులు

సీపీఐ రాష్ట్ర బృందం పర్యటన జయప్రదం చేయండి

చింతలపూడి : సాగునీటి ప్రాజెక్టుల పరిశీలనలో భాగంగా ఈనెల 20న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సారథ్యంలో సీపీఐ రాష్ట్ర బృందం చింతలపూడి ఎత్తిపోతల పథకం కాలువ పరిశీలనకు వస్తున్నట్లు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య తెలిపారు. శనివారం పర్యటనకు సంబంధించిన వివరాలు నాయకులతో కలిసి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర బృందం ఈనెల 13 నుంచి రాష్ట్రంలో ఉన్న అన్ని ప్రాజెక్టులను సందర్శిస్తుందని దానిలో భాగంగానే ఈనెల 20న పోలవరం చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులను పరిశీలిస్తుందని తెలిపారు. పర్యటనను జయప్రదం చేయాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. సీపీఐ మండల సహాయ కార్యదర్శులు పుల్లారి సోమశేఖర్, తుర్లపాటి బాబు, ఏపీ రైతు సంఘం చింతలపూడి మండల కార్యదర్శి దండా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సీపీఐ రాష్ట్ర బృందం పర్యటన వివరాలు తెలియజేస్తున్న సీపీఐ నాయకులు

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓపెన్ డే



ఓపెన్ డే కార్యక్రమంలో పాల్గొన్న శ్రీ వెంకటేశ్వర జూనియర్ కళాశాల విద్యార్థులు

కామవరపుకోట : స్థానిక ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో 2023 – 24 విద్యా సంవత్సరానికి డిగ్రీలో ప్రవేశాల నిమిత్తం శనివారం ' ఓపెన్ డే ' కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.విజయబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్థానిక శ్రీ వెంకటేశ్వర జూనియర్ కళాశాల విద్యార్థులను ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఆహ్వానించి డిగ్రీ కళాశాలలోని లైబ్రరీ, డిజిటల్ రూమ్, సెమినార్ హాల్, తరగతి గదులు, హాస్టల్ మొదలైన వాటిని చూపించడంతోపాటు విద్యార్థుల సమగ్ర అభివృద్ధి, కోర్సుల ప్రాధాన్యత వంటి వాటి గురించి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవీంద్రబాబు వివరించారు. అనంతరం విద్యార్థులతో అధ్యాపకులు ముఖాముఖి నిర్వహించారు.

ఘనంగా ఉరుసు మహోత్సవం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక కోటదిబ్బపై ఉన్న హజరత్ సయ్యద్ బాయజీద్ దర్గాలో ఉరుసు కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది. శనివారం ఉదయం, సాయంత్రం సయ్యద్ బాయజీద్ మహాత్ముని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. తొలుత ఖురాన్ పఠనం చేసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రాత్రి నిర్వహించిన ఖవ్వాలీ కార్యక్రమం ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. ఈ కార్యక్రమంలో దర్గా వంశపారంపర్య ముజావర్లు షేక్ హుస్సేన్, షేక్ సాబీర్ హుస్సేన్, షేక్ షబ్బీర్ హుస్సేన్ తదితరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

సాయి దివ్య రథంతో ద్వారకాతిరుమల క్షేత్రానికి

ద్వారకాతిరుమల: ఏలూరులోని తూర్పువీధి శ్రీ శిరిడీ సాయి మందిరం నుంచి సుమారు 10 వేల మంది భక్తులు శనివారం చినవెంకన్న దివ్య క్షేత్రానికి పాదయాత్రగా విచ్చేశారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏటా వారంతా ఇలా క్షేత్రానికి వస్తున్నారు. ఈ క్రమంలోనే ఉదయం ఏలూరులోని ఆలయం వద్ద నుంచి రథంతో ప్రారంభమైన వారి పాదయాత్ర సాయంత్రానికి క్షేత్రానికి చేరుకుంది. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, బాబా సంకీర్తనల నడుమ రథాన్ని లాగుతూ భక్తులు.. ఆలయానికి చేరుకున్నారు. ఆ తరువాత రథాన్ని స్వామివారి పాదుకామండపం వద్ద ఉంచి, విశేష పూజలు జరిపి, బాబా గీతాలాపనలు చేశారు. అనంతరం వారంతా శ్రీవారు, అమ్మవార్లను దర్శించారు. పాదయాత్ర భక్తులతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. ఇదిలా ఉంటే దారిపొడవున భక్తులకు పలువురు దాతలు మజ్జిగ, మంచినీరు, అల్పాహారం, పండ్లను వితరణ చేశారు.



ద్వారకాతిరుమల క్షేత్రానికి చేరుకున్న సాయి దివ్యరథం

చెట్టును ఢీకొట్టిన కారు



చెట్టు ఢీకొట్టి నుజ్జయిన కారు

బుట్టాయగూడెం : మండలంలోని ముప్పినవారిగూడెం సమీపంలో ఒక కారు చెట్టును ఢీకొంది. ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి ప్రమాద వశాత్తూ కారు చెట్టును ఢీ కొట్టడంతో కారు ముందు భాగం నుజ్జయింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న వంశీ అనే వ్యక్తి కింద పడడంతో అతనికి గాయాలయ్యాయి. అతనిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే కార్‌లో ఉన్నవారికి ఎటువంటి ప్రమాదం జరగలేదు.

పారిజాతగిరి వాసునికి ప్రత్యేక పూజలు

జంగారెడ్డిగూడెం : మహాశివరాత్రి, శనిత్రయోదశి, శనివారం సందర్భంగా గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవెంకటేశ్వరస్వామి వారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. గోవింద నామస్మరణతో పారిజాతగిరి మార్మోగింది. ఉదయం 5 గంటల నుంచి సుప్రభాతసేవ, ఆరాధన, తోమాలసేవ, తీర్థ ప్రసాదగోష్టి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తన్నీరు సత్యనారాయణ, వెంకటేశ్వరరావు భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించినట్లు ఈవో మానికల రాంబాబు తెలిపారు. దాతలను ఆలయ అర్చకులు నల్లూరి రవికుమారాచార్యులు వేద ఆశీర్వచనతో పాటు స్వామి వారి శేష వస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ సభ్యులు కె.శ్రీహరిరావు, దండు ధనరాజు, రెడ్డి రంగప్రసాద్, వాసవీ సాయినగేష్ పాల్గొన్నారు.



విశేష అలంకరణలో దర్శనమిచ్చిన వేంకటేశ్వరస్వామి

20న మాదేపల్లిలో మాతృభాషా దినోత్సవం

ఏలూరు రూరల్: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం పురష్కరించుకుని ఈ నెల 20న మాదేపల్లి జెడ్పీ పాఠశాలలో మాతృభాషా దినోత్సవం నిర్వహించనున్నామని హెచ్ఎం సుంకర వెంకటలక్ష్మి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా తెలుగు, కన్నడ, మళయాళం తదితర భాషల్లో అనువాదం, హిందీలో ఉపసర్గలు గుర్తించడం, ఇంగ్లీషులో కర్తృవాచ్యాలకు కర్మ వాచ్యాలు చెప్పడం తదితర పోటీల్లో బాలబాలికలు పాల్గొంటారని వివరించారు.